క్లుప్తంగా

ప్రత్యేక పూజలు



మండవల్లి: నూతనంగా నిర్మించిన శ్రీషిర్డీ సాయి సంకీర్తనా మందిరంలో ఆదివారం నిర్వాహకులు గుడిపాటి శ్రీరామ ఫణికుమార్ (రాజాజీ) పూజాదికాలు నిర్వహించారు. గణపతి పూజ, నిత్య హోమం, అగ్నిదాన్యం, జలాదివాసం, ఆదివాసంగ హోమం, నీరాజనం, మంత్రప్పం, తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించారు. సోమవారం ఉదయం 10.44 గంటలకు విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. భక్తులు ఈ కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఘనంగా గ్రామోత్సవం

మండవల్లి: సోమవారం ప్రారంభం కానున్న షిర్డీసాయి సంకీర్తనా మందిరంలోని బాబాను ఆదివారం రాత్రి పురవీధుల్లో కనుల పండువగా ఊరేగించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీ గణపతి హోమం



గుడివాడ టౌన్: స్థానిక మెయిన్ రోడ్డులోని శ్రీ విఘ్నేశ్వర స్వామి ఆలయలో ఆదివారం శ్రీ లక్ష్మీ గణపతి హోమం ఘనంగా నిర్వహించారు. బహుళ చవితి సంకష్టహర చతుర్థిని పురస్కరించుకుని ఈ హోమం నిర్వహించినట్లు ఆలయ ఈఓ వై. శ్రీనివాస్ తెలిపారు. 120 మంది ఉభయ భక్తులు ఈ హోమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు కపిలవాయి గోపాలశాస్త్రి, మల్లాది గణేష్ శర్మ, జి. రమాకాంత్ శాస్త్రి పాల్గొన్నారు.

అన్నసమారాధన

గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం భక్తులు స్వామిని దర్శించుకుని తమ మొక్కులను తీర్చుకున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు మెయిల్ మేనేజింగ్ డైరెక్టర్ పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధనను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మెయిల్ ప్రతినిధి పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతులు ప్రారంభించారు.

ఉచిత వైద్యశిబిరం



గుడివాడ టౌన్: రోటరీక్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో ఆదివారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక కోతిబొమ్మ సెంటర్ లోని ప్రగతి గార్డెన్స్‌లో డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల వైద్య బృందం నిర్వహించిన ఈ శిబిరంలో బీపీ, షుగర్, గుండె, రక్తనాళాలు, కిడ్నీ, ఎముకల వైద్య నిపుణులతో 60 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు క్లబ్ అధ్యక్షుడు టిఎస్. రాజశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ పూర్వ అధ్యక్షుడు పి. రామకృష్ణ, సి. సూర్యచంద్రరావు, ఎం. రమణమూర్తి, ఎ. మహదేవ్ దేశాయ్, వైద్యులు డాక్టర్ శ్రీహరి, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ కేఎస్. కరీమ్, డాక్టర్ పి. మదని పాల్గొన్నారు.

వీఆర్వోల సంఘం ఎన్నిక

ముదినేపల్లి రూరల్: మండల వీఆర్వో సంఘం ఎన్నిక స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. అధ్యక్షుడిగా ముదినేపల్లి వీఆర్వో పుప్పాల బాలసుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షుడిగా తోకల శ్రీరాములు, కోశాధికారిగా తుర్లపాటి వెంకటరాజాశ్యాం, కుర్మా సుధీర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన వారిని సహచర వీఆర్వోలు అభినందించారు.

కార్తికేయుని ఆలయంలో భక్తుల కోలాహలం



మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి ఆలయం భక్తజనంతో కోలాహలంగా మారింది. ఆదివారం తెల్లవారుజామునుంచే క్యూలైన్లన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ఆలయ ప్రాంగణం ఎటు చూసినా భక్తులతో నిండిపోయింది. నాగపుట్ట, నాగమల్లివృక్షం, పొంగళశాల వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది. ఆలయ డీసీ దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆధ్వర్యంలో ఆలయ సూపరింటిండెంట్ బొప్పన సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కొండలమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ



అర్చకుడికి విరాళమందిస్తున్న దాత



కొండలమ్మ ఆలయ క్యూలో బారులు తీరిన భక్తులు

గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారి సన్నిధికి ఆదివారం అధికసంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. పాల పొంగళ్లను పొంగించిన మహిళా భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి దర్శనానికి క్యూలో భక్తులు బారులు తీరారు. ఈ వారం ఎక్కువగా నూతన వధూవరుల జంటలు అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈఓ ఆకుల కొండలరావు ఏర్పాట్లు చేశారు.

సుబ్బారాయుడికి పూజలు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్‌లోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం భక్తులు పోటెత్తారు. సదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారి పుట్టలో పాలు పోసి స్వామిని దర్శించుకున్నారు. పాలపొంగళ్లశాల వద్ద మహిళలు నైవేద్యాలు తయారు చేసి స్వామికి సమర్పించారు. ఆలయ సహాయ కమిషనర్ ఆర్. గంగాశ్రీదేవి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అన్నదానానికి విరాళం

ఆలయంలో జరిగే నిత్యాన్నదాన పథకానికి దాత విరాళమందించారు. గుడివాడకు చెందిన సాయిన చరిత్ రూ.11,116 స్వామివారి సన్నిధిలో ప్రధాన అర్చకుడు తోలేటీ వీరభద్రశర్మకు అందజేశారు. దాతకు స్వామివారి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

గుడ్లవల్లేరు పాలిటెక్నిక్ అన్నింటా ముందంజ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రామచంద్రరావు



కూచిపూడి నాట్యం చేస్తున్న విద్యార్థినులు

స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ సెక్రటరీ రామచంద్రరావు

గుడ్లవల్లేరు: ఏపీలోని పాలిటెక్నిక్‌లలోని అన్ని అంశాల్లో గుడ్లవల్లేరు ఏఏఎస్ఎం అండ్ వీవీఆర్ ఎస్ఆర్ పాలిటెక్నిక్ ముందంజలో ఉందని స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ సెక్రటరీ జి.వి.రామచంద్రరావు పేర్కొన్నారు. గుడ్లవల్లేరులో నిర్వహించిన పాలిటెక్నిక్ 44వ వార్షికోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా ఆదివారం విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రసంగించారు. అన్ని అంశాల్లో విజయాల్ని సాధిస్తూ ఈ కళాశాల సాంకేతిక విద్యలో ముందంజలో ఉండటం అభినందనీయమన్నారు. గోల్డ్ మెడల్స్, నగదు బహుమతులు సాధించిన విద్యార్థులను అభినందిస్తూ.. విద్యార్థులు ఉత్తమ విద్యను అభ్యసించడానికి ప్రస్తుత పరిస్థితులు ఎంతో అనుకూలంగా ఉన్నాయన్నారు. ప్రతి విద్యార్థీ తమ కుటుంబ పరిస్థితులను బట్టి భవిష్యత్తును చక్కని మార్గంలోకి మలచుకోవాలన్నారు. విద్యార్థులంతా ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. పాలిటెక్నిక్ విద్య అనంతరం ఉద్యోగావకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. ఆ అవకాశాలను అందిపుచ్చుకోవటానికి విద్యార్థులకు నైపుణ్యాలు అవసరమని చెప్పారు. అనంతరం 2021–24లో పాలిటెక్నిక్ విద్యలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఓవరాల్ పాలిటెక్నిక్ టాపర్‌గా నిలిచిన ఆలూరి లలిత కోమలి, బెస్ట్ స్టూడెంట్‌గా, వివిధ స్థాయిల ఆటల పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచిన భూక్యా జయకుమార్‌ను పాలిటెక్నిక్ క్రీడాకారుడిగా గుర్తించి జ్ఞాపికను అతిథుల చేతుల మీదుగా అందజేశారు. అలాగే ద్వితీయ, తృతీయ సంవత్సరాల్లో టాపర్స్‌గా నిలిచిన విజేతలకు రూ.35వేలు విలువల గల పుస్తకాలను బహూకరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి వల్లూరుపల్లి సత్యనారాయణ, సహ కార్యదర్శి వల్లూరుపల్లి రామకృష్ణ, ప్రిన్సిపాల్ ఎస్.రాజశేఖర్, డైరెక్టర్ నారాయణం శ్రీనివాసమూర్తి, ఇంజినీరింగ్, ఫార్మసీ ప్రిన్సిపాల్స్ డాక్టర్ బి.కరుణకుమార్, డాక్టర్ ఎ.లక్ష్మణరావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అగస్తేశ్వరస్వామివారి వార్షిక కల్యాణం



స్వామివారి కల్యాణోత్సవంతో పాల్గొన్న దంపతులు

బంటుమిల్లి: మండల పరిధిలోని పెదతుమ్మిడి గ్రామంలో కొలువై ఉన్న శ్రీ పార్వతీ సమేత అగస్తేశ్వరస్వామి వారి వార్షిక దశమ కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం పండితుడు సోమరాజుపల్లి ఈశ్వరశర్మ శిష్య బృందం వేద మంత్రోచ్చరణ మధ్య స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, రుద్రహోమాలు వైభవంగా నిర్వహించారు. అనంతరం పలువురు దంపతుల దీక్షధారణలతో స్వామివారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి సువాసినిలచే సామూహిక కుంకుమపూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో భక్తులు వేలాదిగా పాల్గొన్నారు. సాయంత్రం మేళతాళాలతో ఉత్సవమూర్తులను ట్రాక్టరుపై ఉంచి టపాసులు కాలుస్తూ గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్‌పర్సన్ మట్టా విజయలక్ష్మి దంపతులు, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త లక్కాప్రగడ మాధవరావు దంపతులు, కోశాధికారి జల్లూరి శరభయ్యగుప్త దంపతులతో పాటు పలువురు దంపతులు పాల్గొన్నారు.

ట్రెజరీ ఉద్యోగుల సంఘ కార్యవర్గం ఏకగ్రీవం



ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

చిలకలపూడి(మచిలీపట్నం): ఆంధ్రప్రదేశ్ ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్ ఉమ్మడి కృష్ణా జిల్లా కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కలెక్టరేట్‌లోని జిల్లా ఖజానా శాఖ కార్యాలయంలో ఈ ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షునిగా ఎం.జాన్సన్, సహాధ్యక్షుడిగా డి.శ్రీనివాసరావు, కార్యదర్శిగా వి.దీపక్, ఆర్థిక కార్యదర్శిగా హరీష్, ఉపాధ్యక్షులుగా బి.నాగేంద్రం, సురేష్, రమాదేవి, సుధాకర్, జాయింట్ సెక్రటరీలుగా గోపాల్‌సింగ్, రాధిక, వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు.

బూటకపు ఎన్‌కౌంటర్లపై విచారణ జరిపించాలి

ఘంటసాల: ఆపరేషన్ కగార్ పేరుతో బీజేపీ ప్రభుత్వం చేస్తున్న బూటకపు ఎన్ కౌంటర్లపై సుప్రీం కోర్టు న్యాయమూర్తులతో విచారణ జరిపించాలని ఏపీ పౌరహక్కుల సంఘం జిల్లా కమిటీ సభ్యుడు జక్కా కేశవరావు డిమాండ్ చేశారు. ఘంటసాల గోటకంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ పేరుతో బీజేపీ ప్రభుత్వం గిరిజనులపై సాగిస్తున్న ఎన్ కౌంటర్లను ఆపివేయాలన్నారు. జార్ఖండ్, ఛత్తీస్‌ఘడ్, ఒడిశా, ఏఓబీ ప్రాంతాలలో సాయుధ పారామిలటరీ బలగాలతో నిరాయుధులైన గిరిజనుల హత్యలను ఖండిస్తున్నామన్నారు. బూటకపు ఎన్ కౌంటర్లపై విచారణ జరిపి బాధ్యులైన పోలీసు అధికారులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి అరెస్టు చేయాలని కోరారు.

నేడు ప్రజలకు అందుబాటులో మాజీ ఎమ్మెల్యే

పామర్రు: మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్ సోమవారం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద ప్రజలకు అందుబాటులో ఉంటారని ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది ఆదివారం తెలిపారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తమ సమస్యలను మాజీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావచ్చని పేర్కొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

పామర్రు: ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్ర మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ టీ సురేష్‌బాబు పేర్కొన్నారు. స్థానిక సీహెచ్‌సీలో ఆదివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర కోసం అందరూ కలిసి పని చేద్దామన్నారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

పెనమలూరు: కానూరులో వ్యభిచార గృహంపై పోలీసులు ఆదివారం దాడి చేసి పలువురు వ్యక్తులను అరెస్టు చేశారు. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. కానూరు మహదేవపురం కాలనీలో తాడేపల్లికి చెందిన సత్య అనే మహిళ ఇల్లు అద్దెకు తీసుకుంది. ఆమె ఇద్దరు మహిళలను తీసుకు వచ్చి వ్యభిచారం చేయించసాగింది. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు దాడి చేశారు. ఈ ఘటనలో ఇద్దరు మహిళలు, ముగ్గురు విటులు పోలీసులకు పట్టుబడ్డారు. నిర్వాహకురాలు సత్య పరారీలో ఉంది. ఫోన్‌లో వచ్చిన సమాచారంతో సత్య వ్యభిచారం చేయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు

పెనమలూరు: కానూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలవటంతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కానూరు శ్రీనివాసా రెసిడెన్సీలో భార్యభర్తలు సీహెచ్.సూరిబాబు, మాలతి ఉంటున్నారు. వారు శనివారం బైక్‌పై పంటకాలువ రోడ్డులో పటమటకు వెళుతుండగా వెనుక నుంచి వచ్చిన కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో భార్యాభర్తలకు గాయాలు అవటంతో పటమటలోని ప్రైవేటు ఆస్పత్రిలో వైద్య చికిత్సకై చేర్చారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మహా కుంభమేళా పవిత్ర జలం పంపిణీ

ఘంటసాల: మహా కుంభమేళాకు వెళ్లలేని భక్తులకు కుంభమేళా పవిత్ర జలాన్ని శ్రీ జలదీశ్వర స్వామి వారి దేవస్థానంలో ఆదివారం పంపిణీ చేశారు. పలువురు దాతల సహకారంతో సేకరించిన మహా కుంభమేళా పవిత్ర జలాన్ని అర్చకులు చావలి కృష్ణ కిషోర్ ఆధ్వర్యంలో భక్తులకు పంపిణీ చేశారు. ఆలయాభివృద్ధి కమిటీ నిర్వాహకులు జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 10కే రన్



పరుగు పందేలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాము

గుడివాడ టౌన్: స్థానిక ఎన్టీఆర్ స్టేడియం ఆధ్వర్యంలో నిర్వహించిన పర్వతనేని జగన్మోహనరావు మెమోరియల్ 10కే రన్ ఆదివారం పట్టణంలో ఉత్సాహంగా సాగింది. స్థానిక ఎన్టీఆర్ స్టేడియం నుంచి ఏలూరు రోడ్‌లోని ఆర్టీఓ ట్రెనింగ్ పాయింట్ వరకు సాగిన ఈ పోటీలను స్థానిక ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ప్రారంభించారు. పురుషులు, స్త్రీలు, బాలబాలికలకు ఆరు విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో 1,100 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. 10కే రన్ పురుషుల విభాగంలో పి. వినయ్, వై. దాలినాయుడు, పి. పవన్, అండర్–15 బాలికల విభాగంలో 6కే రన్‌లో పి. దీపిక, వి. దివ్య హాసిని, పి. మేరి జ్యోత్స్న, అండర్–15 బాలుర విభాగంలో 6కే రన్‌లో కె. వెంకటేష్, కె. జయసూర్యతేజ, ఎస్. శ్యామ్‌కుమార్, అండర్–12 బాలికల విభాగంలో 4కే రన్‌లో కె. రహస్‌తున్నీసా, ఎస్‌కే అఫ్రీన్, సీహెచ్.హేమలత, అండర్–12 బాలుర విభాగంలో 4కే రన్‌లో వి. ఏసుకుమార్, పి. శ్రీ శ్యామ్‌కుమార్, సీహెచ్. నిషాంత్, ఓపెన్ ఉమెన్ విభాగంలో 6కే రన్‌లో జి. అనిత, బి. నాగ సుశీల, డి. భవాని ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. వీరితో పాటు పలు కన్సోలేషన్ బహుమతులను స్టేడియం పాలక వర్గ సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శి రంగ ప్రసాద్, మున్సిపల్ మాజీ చైర్మన్ లంకదాసరి ప్రసాదరావు, పాలక మండలి సభ్యులు డి. రవికుమార్, పర్వతనేని ఆనంద్, వర ప్రసాద్ పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో గౌతమ్ విద్యార్థుల ప్రతిభ



బహుమతులు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసాద్

గుడివాడ టౌన్: రాష్ట్ర స్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించి పతకాలు సాధించారని గౌతమ్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ ప్రిన్సిపాల్ పి. లక్ష్మీ ప్రసాద్ తెలిపారు. ఆదివారం పతకాలు సాధించిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 9వ తేదీ విజయవాడ మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో జరిగిన 22వ రాష్ట్ర కరాటే చాంపియన్ షిప్ 2024–25 పోటీల్లో తమ విద్యార్థులు కె. వేదశ్రీ నాగేంద్రకుమార్ అండర్–11, టి. హేమంత్ అండర్–14 విభాగంలో ప్రతిభను ప్రదర్శించి తృతీయ బహుమతి సాధించారని తెలిపారు. విజేతలను కోచ్ వెంకటేశ్వరరావును అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ సత్యారామ్, జ్యోతి, ప్రశాంతి పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం మార్పుపై అభ్యంతరం



ప్రస్తుతం కొనసాగుతున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

మొవ్వ: మొవ్వలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ప్రస్తుతం ఉన్న చోట నుంచి వేరే ప్రాంతానికి తరలించడంపై గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయం మార్పు వలన కలిగే అసౌకర్యాలను తెలుపుతూ 50 మందికి పైగా సంతకాలతో కూడిన ఓ వినతిపత్రాన్ని కలెక్టర్ కార్యాలయానికి పంపినట్లు గ్రామస్తులు ఆదివారం స్థానిక విలేకరులకు తెలిపారు. నాలుగు దశాబ్దాలుగా బందరు రోడ్డులో రైతులకు అందుబాటులో కొనసాగుతున్న ఈ కార్యాలయాన్ని ఆకస్మికంగా గూడపాడు రోడ్డులోని పురాతన భవనంలోకి మార్చాల్సిన ఆవశ్యకత ఏమిటని ప్రశ్నిస్తున్నారు. మొవ్వ, ఘంటసాల మండలాలతో పాటు చల్లపల్లి మండలంలో కొన్ని గ్రామాలకు విస్తరించిన ఈ కార్యాలయ సేవలు అటు రైతులకు, ప్రజలకు అనుకూలంగా అందుబాటులో ఉందని పేర్కొంటున్నారు. నిర్ణయించిన భవనం ప్రస్తుతం శిథిలావస్థలో ఉండి చెదలు పుట్టలు పెట్టి ఉన్నాయని తెలిపారు. దస్తావేజులు, రికార్డులు భద్రపరచుకునేందుకు కూడా అనుకూలంగా లేదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 10వ తేదీన ఆఫీసు మార్చడానికి ప్రకటించిన ఫైల్‌పై పునరాలోచించి తగు నిర్ణయాన్ని తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరినట్లు గ్రామస్తులు తెలిపారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం



బాధితులను పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ ముదిరాజుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు విష్ణువర్ధనరావు

కైకలూరు: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో తాటాకు ఇల్లు దగ్ధమై సర్వం కోల్పోయిన బాధితులకు వైఎస్సార్ సీపీ ముదిరాజుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కోమటి విష్ణువర్ధనరావు ఆదివారం అండగా నిలిచారు. కలిదిండి మండలం కోరుకొల్లు శివారు బొబ్బిలిగూడెంలో గంజాల మల్లయ్య ఇల్లు శనివారం దగ్ధమైంది. విషయం తెలుసుకుని వచ్చిన విష్ణువర్ధనరావు నిత్యావసర సరుకులకు నగదును అందించారు. ఇంటి నిర్మాణానికి సాయం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కైకలూరు అసెంబ్లీ నియోజకవర్గ పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడు పాము రవికుమార్, బాలాజీ, నాగరాజు, పరస శ్రీనివాసరావు, గంజాల సత్యనారాయణ, గోపాలం, చంటోడు, కోమటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైభవంగా వీరమ్మతల్లి తిరునాళ్ల



భక్తజనులతో అమ్మవారి ఆలయ ప్రాంగణం



వీరమ్మతల్లికి పట్టువస్త్రాలు సమర్పించి పూజలు జరిపిస్తున్న వైఎస్సార్ సీపీ నేత దేవభక్తుని




అమ్మవారికి మొక్కులు చెల్లించేందుకు వస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది

ఉయ్యూరు: స్థానిక వీరమ్మతల్లి తిరునాళ్లకు ఆదివారం భక్తులు ఊరేగింపుగా తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది అమ్మవారిని దర్శించుకుని పొట్టేళ్లను కానుకగా సమర్పించారు. వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి పూజా కార్యక్రమాలు జరిపించారు. అమ్మవారి దర్శనం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. వీరమ్మతల్లి చల్లని చూపు, ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కోరినట్టు తెలిపారు.



ఎండకు గొడుగుతో యువకులు



పొగమంచు కారణంగా లైట్లు వేసుకుని వెళుతున్న వాహనాలు



గొడుగు వేసుకుని వెళుతున్న బాలుడు

పగలు ఎండ.. రాత్రి మంచు

భిన్నమైన వాతావరణంతో ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు. రాత్రి సమయంలో విపరీతమైన చలి.. పగలు మండు వేసవిని తలపించే ఎండలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రిళ్లు చలి బయటకు రాకుండా చేస్తోంది. ఉదయం ఎనిమిది గంటలైనా పొగమంచు దుప్పటిలా కమ్మేస్తోంది. వాహనచోదకులకు లైట్లు ఉంటే గాని ఎదురుగా వస్తున్న వాహనాలు కనబడటం లేదు. ఉదయం 10గంటలు దాటగానే ఎండ మండిపోతోంది. ఫిబ్రవరిలోనే ఎండలకు గొడుగులను ఆశ్రయిస్తున్నారు. – గుడ్లవల్లేరు